క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని రిక్షా ఘాటి, ఏడు ఘోరీల సెంటర్, శ్రీ సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రాంతం, విజయలక్ష్మి థియేటర్ ప్రాంతం, బుద్ధ పార్క్ ప్రాంతం, పంట కాలువ రోడ్డు, టీచర్స్ కాలనీ, కుండీ సెంటర్, శనగపప్పు బజారు, ఎలక్కాయల సందు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తి చేయాలి

ఏలూరు (టూటౌన్): జంగారెడ్డిగూడెం మండలం పట్టెన్నపాలెం వద్ద ఉన్న జల్లేరు వాగుపై వంతెన నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, ప్రమాదాలను అరికట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జల్లేరు వాగుపై వంతెన నిర్మాణం గిరిజనుల కల అని, ఏజెన్సీ ముఖద్వారంగా చెప్పుకొనే ఈ ప్రాంతం నుంచి అటు తెలంగాణ, ఇటు జంగారెడ్డిగూడెం వయా ఏలూరుకు రావాలంటే ఈ జల్లేరు వాగు దాటాలని పేర్కొన్నారు. 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం రూ.5 కోట్ల అంచనాతో జల్లేరు వాగుపై వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని, నేటికీ పూర్తి కాలేదని తెలిపారు.

క్రీడాకారులకు టీషర్టులు అందజేత

ఏలూరు రూరల్ : వివిధ కారణాలతో మృతి చెందిన స్నేహితులను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న స్నేహాంజలి క్రికెట్ పోటీలు అందర్ని ఆకర్షిస్తున్నాయని స్నేహాంజలి ఆర్గనైజర్ చందు అన్నారు. బుధవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జెర్సీ జట్టు ఆటగాళ్లకు మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సొంగా సందీప్ టీషర్టులను అందజేశారు. 12 ఏళ్లుగా నిర్వహిస్తోన్న పోటీలకు విశేష స్పందన వస్తుందన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నూతన పీఆర్‌సీ అమలుకు చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో కోరారు. ఈ బడ్జెట్‌లోనే పీఆర్‌సీకి నిధులు కేటాయించాలని, ఇప్పటికే నూతన పీఆర్‌సీ అమలు ఆలస్యమయినందున ఐఆర్ ప్రకటించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను విజ్ఞానయాత్రలకు తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో పర్యటింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించటం హర్షణీయమని, దీంతో విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచన శక్తి పెరుగుతుందని తెలిపారు.

రిక్షా కార్మికులు, చిరు వ్యాపారుల ఆగ్రహం

- 40 ఏళ్లుగా ఉంటున్న చోటును ఖాళీ చేయించడం దారుణం
- కార్మిక సంఘాల సంఘీభావం
- న్యాయం చేయాలని డిమాండ్

ఏలూరు (టూటౌన్): ఫ్లాట్‌ఫామ్ రిక్షా స్టాండు, పూల షాపులు నిర్వహిస్తున్న స్థలాలను కార్పొరేషన్ అధికారులు ఖాళీ చేయించడంతో బాధిత చిరు వ్యాపారులు, రిక్షా కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీడ, గూడును లేకుండా చేయడం అన్యాయమని వాపోతున్నారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతం బడేటి చౌక్‌కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని 40 ఏళ్లుగా స్టాండుగా దాదాపు 25 మంది ఫ్లాట్ ఫామ్ రిక్షా కార్మికులు వినియోగిస్తున్నారు. రిక్షా స్టాండ్ డేరాలను ఆక్రమణల తొలగింపులో భాగంగా ఈ నెల 18న కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసుల సమక్షంలో తొలగించారు. ప్రత్యామ్నాయ స్థలం చూపించకుండా రిక్షా స్టాండును ఏకపక్షంగా, దౌర్జన్యంగా ఖాళీ చేయించడం దుర్మార్గమని కార్మిక సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా రిక్షా స్టాండ్, పువ్వుల షాపుల స్థానంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారు.


ఆక్రమణల తొలగింపును నిరసిస్తూ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళుతున్న బాధితులు


ఎమ్మెల్యే బడేటి చంటికి సమస్యను వివరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎమ్మెల్యే దృష్టికి సమస్య

రిక్షా స్టాండ్ స్థలం ఖాళీ చేయించిన విషయాన్ని ఐఎఫ్‌టీయూ నాయకులు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) దృష్టికి తీసుకెళ్లారు. బాధితులకు తక్షణం న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగానే స్పందించారని నాయకులు తెలిపారు.

ప్రత్యామ్నాయం చూపాలి



ఫ్లాట్‌ఫాం రిక్షా స్టాండుగా వినియోగిస్తున్న ప్రాంతాన్ని కార్పొరేషన్ అధికారులు తొలగించడం దుర్మార్గం. తక్షణం కార్మికులకు ప్రత్యామ్నాయ స్థలాన్ని మార్కెట్ ప్రాంతంలోనే చూపాలి. బడుగు జీవులపై జులుం సరికాదు. పేదల ఉపాధికి గండి కొట్టే చర్యలను విరమించుకోవాలి.

– బద్దా వెంకట్రావు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి

తక్షణం ఆదుకోవాలి



రెక్కాడితే గాని డొక్కాడని బడుగు జీవుల పట్ల అధికారులు తమ ప్రతాపం చూపడం తగదు. ఏలూరు నగర పాలక సంస్థ అధికారులు, ప్రజా ప్రతినిధులు కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలి. చిరు వ్యాపారులు, రిక్షా కార్మికులను తక్షణం ఆదుకోవాలి.

– యర్రా శ్రీనివాసరావు, ఇఫ్టూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి

జాగృతికి జాతీయ రికార్డులు


జాగృతికి ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన చిన్నారి నారాయణం జాగృతి బుధవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిలో భాషల సంబరాలు కార్యక్రమంలో పాల్గొని ఆరు జాతీయ రికార్డులు సృష్టించింది. నగరంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న జాగృతి ఇప్పటికే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు సూపర్‌కిడ్స్ రికార్డులు కలిపి మొత్తం 61 రికార్డులను నమోదు చేసుకుంది. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారి జాగృతి అసమాన ప్రతిభ చాటుకుంది. ఈ సందర్భంగా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పంకజ్ కుమార్, ఎంఈఓ దేవినేని వెంకట రమణ, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్‌కిడ్స్ రాష్ట్ర సమన్వయకర్త సిరిమువ్వ శ్రీనివాస్ మాట్లాడారు.

రైతు బజారులో తనిఖీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పత్తేబాద రైతు బజారులో మార్కెటింగ్ శాఖ, విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రైతులే స్వయంగా కూరగాయలు, కార్డుదారులు విక్రయాలు చేస్తున్నారా లేక బినామీలు విక్రయిస్తున్నారా? పండిస్తున్న కూరగాయలను విక్రయిస్తున్నారా, లేక ఇతర రాష్ట్రాల కూరగాయలు విక్రయిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. కార్డులో నమోదు చేసినవి కాకుండా ఇతర రకాల కూరగాయలు కూడా విక్రయిస్తున్న రైతును వారు ప్రశ్నించారు. రైతు బజారులో మరుగుదొడ్లు నిర్మించడానికి ప్రతిపాదించాల్సి ఉందని అధికారులు తెలిపారు. రైతుబజారులో గతంలో ఎస్టేట్ అధికారి ఉండే కార్యాలయం షెడ్డును ఆధునికీకరిస్తే మరింత మంది రైతులకు స్థానం కల్పించడంతో పాటు వినియోగదారులకు మరిన్ని దుకాణాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఈ మేరకు నివేదికను త్వరలోనే మార్కెటింగ్ శాఖ కమిషనర్‌కు నివేదిస్తామని తెలిపారు. తనిఖీల్లో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.శారదారాణి, మార్కెటింగ్ ఏడీలు ఎం వరలక్ష్మి, ఎండీవీ శ్రీనివాసరావు, వి.మహేంద్రనాథ్, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ ఎస్‌కే మెహరాజ్ బాషా పాల్గొన్నారు. వీరికి రైతు బజారు ఎస్టేట్ అధికారి సుధాకర్ సహకరించారు.


రైతు బజారులో తనిఖీ చేస్తున్న అధికారులు

ఆలీషాను పరామర్శించిన జేపీ


అబ్దుల్ ఆలీషాను పరామర్శిస్తున్న జేపీ

ఏలూరు (టూటౌన్): ఇటీవల సర్జరీ చేయించుకున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త అబ్దుల్ ఆలీషాను ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గం ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) బుధవారం సాయంత్రం పరామర్శించారు. ఆలీషా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు గుడిదేశి శ్రీనివాస్, రియాజ్, నూకపెయ్యి సుధీర్ బాబు, నేరుసు చిరంజీవి, గంటా మోహన్‌రావు, కిలాడి దుర్గారావు, తులసి, గంటా సాయి ప్రదీప్, మద్దాల ఫణి, గాజుల బాజీ, పేరయ్య, కిషోర్, శంకర్, రమేష్ ఉన్నారు.

వెంకటేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటాం

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త విస్సకోటి వెంకటేశ్వరరావు బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ల పల్లి జయప్రకాష్ (జేపీ) సందర్శించిన నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నివాళులర్పించిన వారలో పార్టీ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం ఇన్‌చార్జి కారుమూరి సునీల్, నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్ బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు షమీం, రాష్ట్ర మైనార్టీ నాయకులు గాజుల బాజీ, రాష్ట్ర యూత్ కార్యదర్శి వెంకటేష్, నగర ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు శివ, వాలంటరీ విభాగం అధ్యక్షుడు గణేష్, యూత్ నాయకులు బండ్లమూడి సునీల్, కోటి, స్థానిక నాయకులు ఉన్నారు.


వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రకాష్, మాజీ మంత్రి కారుమూరి

వైభవంగా రామకోటి ఉత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కళ్యాణ ం నిర్వహించారు. సాయంత్రం నగరంలోని హనుమాన్ నగర్ రాధాకృష్ణ పిరమిడ్ ధ్యాన మందిరం ప్రతినిధి రాధ జోస్యుల సీతమ్మ వారి దివ్య చరితామృతం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి నెల్లూరుకు చెందిన పరాయతం నారాయణాచార్యులు భాగవతార్ భక్తనందనార అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు. ఈ సందర్భంగా భాగవతార్‌ను రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ సన్మానించారు.


భాగవతార్‌ను సన్మానిస్తున్న రమేష్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గణపవరం: రాష్ట్రంలో భవననిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల బీమా సదుపాయం కల్పించాలని కోరుతూ గణపవరం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు భవననిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఆదినారాయణ, ఏడిది వేణుగోపాల కృష్ణ, సబ్బారపు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల అభివృద్ధికి కృషి చేయాలి

పెదవేగి : చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద అన్నారు. బుధవారం పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖ పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తోన్న జ్ఞానజ్యోతి శిక్షణ బుధవారం రెండో కార్యక్రమంలో శారద పాల్గొని మాట్లాడారు. పిల్లల పోషణతో పాటు విద్యపై మక్కువ పెంచేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్, ఈఓ మల్లిక, పర్యవేక్షకురాలు మేరీ, పార్వతి, శాంత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పెదవేగి : మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ శారద

లక్ష్యాలు సాధించాలి

దెందులూరు: జ్ఞానజ్యోతి పథకం లక్ష్యాలను సాధించాలని ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక గారపాటి హైమావతీదేవి ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ దెందులూరు, పోతునూరు, సోమవరప్పాడు సెక్టార్ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, శ్రీదేవి, భూషణం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పథకంపై శిక్షణ ఇచ్చారు. పిల్లల స్వభావం, లక్షణాలు, అభ్యాసన సమగ్ర అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధా సృజనాత్మకతపై ఎంఈఓ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్లు మల్లికార్జునరావు, గ్రంథ పాలకులు గొల్లపూడి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల శిక్షణ ప్రారంభం

ఉంగుటూరు: స్థానిక హైస్కూల్లో అంగన్‌వాడీ టీచర్ల జ్ఞానజ్యోతి శిక్షణను ప్రధానోపాధ్యాయులు మీరాకుమారి బుధవారం ప్రారంభించారు. ఎంఈఓ రవీంద్ర భారతి మాట్లాడుతూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. శిక్షణ పరిశీలకులుగా షేక్ ఫరీదా, ట్రైనింగు ఆర్పీలుగా అల్లు శ్రీను, శిరికి శివ, శివకుమార్, బి.శ్రీలక్ష్మి, డి.శారదామణి వ్యవహరించారు. సీఎం ఆర్‌టీ నాగేంద్ర, విష్ణు, నారాయణ, రవికిశోర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


ఉంగుటూరు : శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	14	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	20	బీన్స చిక్కుడు	50
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	36	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	36	బీట్‌రూట్	34
బీరకాయలు (పందిరి)	48	కీరా దోస	44
కాలీఫ్లవర్	00	ఫ్రెంచ్‌బీన్స్	60–80
క్యాబేజీ	14	అల్లం	50
క్యారెట్	34	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	38	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	32	గోంగూర	07–10
దోసకాయలు	26	పుదీనా	05
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	52
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్	22.30	13
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	33
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

అగ్రిస్టాక్ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

గణపవరం: రైతులకు అగ్రిస్టాక్ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరని జిల్లా వ్యవసాయ అధికారి జడ్ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం గణపవరం మండలం మొయ్యేరు రైతు సేవా కేంద్రంలో ఆయన అగ్రిస్టాక్ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్‌పై అధికారులతో సమీక్షించారు. సాధ్యమైనంత త్వరగా రైతుల రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సొంత పొలం ఉన్న రైతులు తమ వివరాలను అగ్రిస్టాక్ వెబ్‌సైట్‌లో రైతుసేవా కేంద్రాల ద్వారా త్వరగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్టర్‌అవడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలద్వారా వచ్చే అన్నిరకాల పథకాలు, రాయితీలు, పెట్టుబడి, ఎరువుల రాయితీలు, పంటల బీమా, కనీస మద్దతు ధర, పంటల రుణాలు, వివిధరకాల వ్యవసాయ అనుబంధ రంగాల సేవలకు ఇది ఉపయోగపడుతుందని అన్నారు. ఈసందర్భంగా రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, వీఏఏలు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అక్రమాలకు చెక్

- సమగ్ర సమాచారం కోసం యాప్ రూపకల్పన
- ఉపాధి కూలీలకు బాసటగా నిలిచిన జన్ మరేగా యాప్

భీమడోలు: ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టిని సారించింది. జన్‌మన్ రేగా యాప్‌ను రూపొందించింది. కూలీల సమగ్ర సమాచారం ఇందులోని నిక్షిప్తమై ఉంటుంది. వేతన బకాయిలు, జాబ్ కార్డుల కోసం ఎంపీడీఓ, పోస్టాఫీసుల, ఉపాధి హామీ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయకుండా ఈ యాప్‌లోని కూలీల సమస్త సమాచారాన్ని తెలుసుకోవచ్చు. స్మార్ట్ ఫోన్‌లో ఒక క్లిక్‌తో ఇట్టే సమాచారాన్ని పొందే అవకాశం కలిగింది.

అనర్హులకే అందలం

ఉపాధి పనులు అనర్హులకే లబ్ధి చేకూరుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వచ్చిన పార్టీల నాయకులు తమ అక్రమాలకు ఈ పథకాన్ని అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. దీంతో పని చేసిన కూలీల సొమ్ము అనర్హులకు చేరుతోంది. కూలీలకు న్యాయబద్ధంగా అందాల్సిన సొమ్ముకు కోత పడుతోంది. కూలీకి రోజువారీ కూలీ సొమ్ము రూ.300 కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఆ మొత్తం చేతికందడంలేదు. ప్రస్తుతం 100 పని దినాలు అమలవుతున్నాయి. అయితే పని చేయకపోయినా చేసినట్లు మస్తర్లు వేసుకోవడం, కూలీల సొమ్ము స్వాహా వంటివి బహిరంగ ప్రజావేదికల్లో ఆడిట్ జరితేనే వెలుగుల్లోకి వచ్చేవి. ఇకపై ఈ యాప్ ద్వారా అవినీతిని ఇట్టేగుర్తించి ఫిర్యాదు చేయవచ్చు. కూలీలతో కాకుండా యంత్రాలతో పని చేసినా, బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసినా, నిధుల దుర్వినియోగం, దొంగ మస్తర్లకు పాల్పడినా ఈ యాప్‌తో ఫిర్యాదు చేయవచ్చు. అధికారులు విచారణ చేపడతారు.


పోలసానిపల్లిలో కూలీల హాజరును సెల్‌లో నమోదు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

కూలీలకు భరోసా

జన్ మరేగా యాప్ ద్వారా కూలీలకు భరోసా కల్పించేందుకు పనుల్లో పారదర్శకతను పెంచేందుకు దోహదపడుతుంది. కొత్తగా వచ్చిన జాతీయ మొబైల్ మానిటరింగ్ సిస్టంపేరిట యాప్ ద్వారా ముఖ ఆధారిత గుర్తింపు యాప్‌తో పనులకు హాజరైన కూలీల ఫొటోలు తీస్తున్నారు. ఐదు మీటర్ల దూరం నుంచి ఒకేసారి పది మందిని ఫొటో తీయవచ్చు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

సెల్‌ఫోన్‌లో గూగుల్ ప్లేస్టోర్‌లో వెళ్లి జన్‌మన్‌రేగా అని టైప్ చేసి యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవాలి. క్లిక్ చేయగానే వారి పూర్తి సమాచారం డిస్‌ప్లేపై కనిపిస్తుంది. కూలీల వివరాలు, వారి హాజరు, వేతనాలు తదితర వివరాలను క్లిక్ చేస్తే వివరాలు వస్తాయి. కూలీ పేరుపై క్లిక్ చేస్తే పని చేసిన రోజులు, కూలీ వేతనం మొత్తం, ఏ బ్యాంకు లో జమ అయ్యింది, బకాయిలు వంటి పూర్తి వివరాలు వస్తాయి. వేతనాలు జమ కాకుంటే కారణాలు కూడా స్పష్టంగా కనిపిస్తాయి.

యాప్‌తో అవకతవకలను గుర్తించవచ్చు

గతంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి వివరాలన్నీ పబ్లిక్ డోమైన్‌లో ఉండేవి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కార్మికులకు మరింత బాసటగా నిలిచేందుకు జన్‌మన్ రేగా యాప్‌ను రూపొందించింది. దీని ద్వారా ఎక్కడ ఎటువంటి అవకతవకలకు పాల్పడినా గుర్తించేందుకు వీలుంటుంది. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చు. ఈ యాప్‌ను ప్రతి ఒక్క కార్మికుడు డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌పై ఇప్పటికే ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం. పనులు మరింత పారదర్శకతతోనే, సమర్థవంతంగా చేపట్టేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం.

– దామోదర్, ఏపీడీ, ఏలూరు క్లస్టర్

ప్రజా సమస్యలపై ఫిర్యాదు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రజా సమస్యలపై పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశానని న్యాయవాది రామనపూడి సత్య సూర్య వీర వెంకట శివప్రసాద్ తెలిపారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వైఎంహెచ్‌ఏ హాలు వెనుక భాగంలో ఉన్న పువ్వుల షాపుల సందులో ఆక్రమ కట్టడాల కారణంగా సుమారు 40 అడుగుల రోడ్డు 10 అడుగులకు కుచించుకు పోయిందని పేర్కొన్నారు. ఈ రోడ్డులో ఇటీవల ప్రగల్లపాటి రమేష్ అనే వ్యక్తి భారీ భవంతి నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. మూడో పట్టణం మినీ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్కింగ్ కారణంగా తరచూ ప్రమాదాలు సంభవించి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, గాయాల పాలవుతున్నారని వివరించారు. పోస్టల్ కాలనీలో రోడ్డుకు ఇరువైపులా నిలిపివేస్తున్న లారీలు ప్రమాదాలకు కారణమవుతున్నాయని తెలిపారు. ప్రజా ప్రయోజనార్థం తాను దాఖలు చేసిన పిటీషన్‌పై విచారించి సత్వర న్యాయం చేయాలని వెంకట శివప్రసాద్ కోరారు.